# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ హనుమాన్ జయంతిని పురస్కరించుకుని దేశ్యాప్తంగా ఈరోజు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు.
- ❖ ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు.
- ❖ స్వరాజ్యం కోసం పోరాటం ఎప్పటికీ ఆగిపోకూడదనేది ఛత్రపతి శివాజీ మహరాజ్ సందేశమని కేంద్రహోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ❖ ఆఫ్రికా - ఇండియా కీ మారిటైమ్ ఎంగేజ్ మెంట్ - బహుళపక్ష విన్యాసాలు టాంజానియాలో రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి.
- ❖ రానున్న మూడు రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది.

======================

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్ లోని ఆలయాల్లో ఈరోజు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. పూజలు జరిపేందుకు అయోధ్యలోని హనుమాన్ గర్హి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పలువురు భక్తులు సరయూ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి రామాలయాన్ని సందర్శించారు. వారణాసిలోని సంకట్ మోచన్ హనుమాన్ ఆలయంలో పూజలు చేసేందుకు భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. భక్తులు ఆశీర్వాదం తీసుకుంటూ, ప్రార్థనల్లో పాల్గొంటూ హనుమాన్ చాలీసా, సుందర కాండ పారాయణం చేశారు. అయోధ్య, వారణాసిలో భక్తులకు సజావు దర్శనం కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

======================

దేశ ప్రజలకు ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. సంకటమోచన్ హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

======================

ఛత్రపతి శివాజీ మహారాజ్ చారిత్రాత్మక పీఠమైన రాయ్ గఢ్ కోటను దేశ యువతకు స్ఫూర్తిదాయకంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం రెండూ కట్టుబడి ఉన్నాయని కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్రపతి శివాజీ 345వ వర్ధంతి సందర్భంగా ఈ రోజు మహారాష్ట్రలోని రాయ్ గఢ్ కోటలో అమిత్ షా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... స్వరాజ్యం కోసం పోరాటం ఎప్పటికీ ఆగిపోకూడదనేది ఛత్రపతి శివాజీ మహరాజ్ యొక్క శాశ్వత సందేశమని అన్నారు. శివాజీ మహారాజ్ దార్శనీకతను కేంద్ర ప్రభుత్వం విశ్వసనీయంగా అనుసరిస్తోందని తెలిపారు. యావత్ ప్రపంచానికి భారతదేశాన్ని ఆశాదీపంగా స్థాపించడానికి అవిశ్రాంతంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొంటూ...

(వాయిస్30 సెకన్లు)

======================

ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. సీఆర్పీఎఫ్ కోబ్రా బెటాలియన్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ సంయుక్త బృందం ఇంద్రావతి అటవీ ప్రాంతంలో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తోంది. ఈ ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. మరణించిన నక్సలైట్ల మృత దేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. అంతేకాకుండా ఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

======================

ఆఫ్రికా - ఇండియా కీ మారిటైమ్ ఎంగేజ్ మెంట్ - బహుళపక్ష విన్యాశాలు టాంజానియాలో రేపటి నుంచి ప్రారంభం కానుంది. 6 రోజుల పాటు జరిగే ఈ విన్యాసాలు ఈనెల 18వ తేదీతో ముగుస్తాయి. ఉమ్మడి ప్రాంతీయ సముద్ర సవాళ్లకు సహకార పరిష్కారాలను అభివృద్ధి చేయడం ఈ విన్యాశాల లక్ష్యం. కొమొరోస్, జిబౌటి, కెన్యా, మడగాస్కర్, మారిషస్, మొజాంబిక్, సీషెల్స్, దక్షిణాఫ్రికా దేశాలు ఈ విన్యాసాల్లో పాల్గొంటాయి. భారతీయ నౌకలు ఐఎన్ఎస్ చెన్నై, ఐఎన్ఎస్ కేసరి, ఐఎన్ఎస్ సునయన ఈ విన్యాసాల్లో పాల్గొంటాయి.

======================

రోజ్ వ్యాలీ పోంజీ కుంభకోణంతో ప్రభావితమైన లక్షలాది మంది పెట్టుబడిదారులకు న్యాయం చేసే దిశగా ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి 515 కోట్ల రూపాయలకు పైగా డిమాండ్ డ్రాఫ్ట్ ను అసెట్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ డీకే సేథ్ కు ఈ రోజు అందజేశారు. దాదాపు 7.5 లక్షల మంది బాధితులకు తిరిగి చెల్లించేందుకు ఈ డబ్బు ఉపయోగపడుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటివరకు 31 లక్షలకు పైగా క్లెయిమ్ ల కమిటీకి అందాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశా, అస్సాం, త్రిపుర రాష్ట్రాల్లో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద రోజ్ వ్యాలీ గ్రూప్ పై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ప్రస్తుతం ఐదు వేర్వేరు కేసులను దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే ప్రత్యేక కోర్టుల్లో అభియోగాలు దాఖలయ్యాయి. భూములు, హోటల్ టైమ్ షేర్లు, అధిక వడ్డీ రాబడులు ఇస్తామంటూ ప్రజల నుంచి 17,500 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. చాలా మంది బాధితులు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారు. సమీకరించిన మొత్తం నిధుల్లో 6,600 కోట్ల రూపాయలకు పైగా ఇన్వెస్టర్లకు తిరిగి ఇవ్వలేదు. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన అతిపెద్ద దర్యాప్తులో ఇదొకటని అధికారులు చెబుతున్నారు.

విరామం

=======================

భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి, పద్మా అవార్డు గ్రహీత 95 సంవత్సరాల కుముదిని లఖియా ఈ రోజు అహ్మదాబాద్‌లో మృతి చెందారు. ఆమె మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మధ్యమ వేదికగా సంతాపం వ్యక్తం చేశారు. కథక్, శాస్త్రీయ నృత్యాల పట్ల ఆమెకున్న మక్కువ ఆమె చేసిన కృషిలో ప్రతిబింబించిందని నరేంద్ర మోదీ కొనియాడారు. కుముదిని లఖియా చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుముదిని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1930లో జన్మించారు. 1967లో అహ్మదాబాద్‌లో కదంబ సెంటర్ ఫర్ డ్యాన్స్ సంస్థను స్థాపించారు. ఇందులో ఆమె చేసిన కృషికి గాను 2025లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. అంతకుముందే పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డును కూడా అందుకున్నారు.

=======================

జమ్ముకశ్మీర్ లోని కిష్త్వార్ జిల్లా ఛత్రూ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని ఛత్రూ ప్రాంతంలోని అడవుల్లో ఉగ్రవాదులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు భద్రతా దళాలు గుర్తించడంతో ఎదురుకాల్పులు జరిగాయి. జమ్మూలోని కొండ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఉగ్రవాదులపై నిఘా పెట్టేందుకు భద్రతా సంస్థలు దోడా జిల్లాలోని భదేర్వా ప్రాంతానికి నిఘా పరిధిని విస్తరించాయి. ఆ ప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

=======================

అమెరికాలో 30 రోజులకు పైగా నివసిస్తున్న విదేశీ పౌరులందరూ ఫెడరల్ ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో జరిమానాలు, జైలు శిక్ష, బహిష్కరణతో సహా కఠినమైన శిక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వైట్ హౌస్ ప్రకటించింది. కొత్త నిబంధన ప్రకారం వీసా కలిగి ఉన్నవారు, చట్టబద్ధమైన శాశ్వత నివాసితులతో సహా విదేశీయులు ఎల్లప్పుడూ రిజిస్ట్రేషన్ రుజువును కలిగి ఉండాలని అధికారులు ప్రకటించారు. 14 సంతవత్సరాలు నిండిన పిల్లలు కూడా ముందస్తు రిజిస్ట్రేషన్ తో సంబంధం లేకుండా తిరిగి నమోదు చేసుకోవాలని సూచించారు. జాతీయ భద్రతా చట్టాన్ని అమలు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు.

=======================

తెలంగాణ చెట్టు మనిషిగా పేరొందిన పద్మశ్రీ డి.రామయ్య తన స్వగ్రామం ఖమ్మం జిల్లా రెడ్డి పల్లిలో ఈ రోజు ఉదయం మృతి చెందారు. రామయ్య మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా రామయ్య గుర్తుండిపోతారని అన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదికగా తెలుగులో స్పందించారు. లక్షలాది మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారని, ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్ తరాలపట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఆయన చేసిన కృషి.. యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుందని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా హైదరాబాద్ వేదికగా ఈరోజు పంజాబ్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ దిగిన పంజాబ్ కింగ్స్ 11 ఓవర్లకు 2 వికెట్ నష్టానికి 130 పరుగులు చేసింది.

=======================

రానున్న మూడు రోజుల్లో అస్సాం, మేఘాలయలో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. ఉప హిమాలయ పశ్చిమ బెంగాల్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ లలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఈనెల 14వ తేదీ వరకు దేశంలోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న ఐదు రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కోస్తాంధ్ర, యానాం, తెలంగాణ, కర్ణాటకలో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

=======================

=======================